


అదనపు ఈవో ఆకస్మిక తనిఖీ


శ్రీవారి బూందీ పోటును తనిఖీ చేస్తున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి శనివారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా లడ్డూ కౌంటర్లు, అగరబత్తీల స్టోర్స్‌ను సందర్శించి విక్రయాలను పరిశీలించారు. అనంతరం బూందీ పోటును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

బియ్యం ఇస్తే.. కందిపప్పు, చక్కెర స్వాహా!



- బ్లాక్ మార్కెట్‌కు తరలింపు
- డీలర్లు కార్డుదారులకు ఇవ్వని వైనం
- పట్టించుకోని పౌర సరఫరాల శాఖ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: దారిద్ర్య రేఖకు దిగువన వున్న పేదలకు ప్రతి నెలా బియ్యం, కందిపప్పు, చక్కెర రేషన్ సరుకులు చౌక దుకాణాల ద్వారా డీలర్లు పంపిణీ చేయాల్సి వుంది. అయితే రేషన్ డీలర్లు మొదటి రోజు బియ్యం, చక్కెర, కందిపప్పు కొందరికి ఇచ్చి రెండవ రోజు చక్కెర, కందిపప్పు బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. పౌర సరఫరాల శాఖ కళ్లకు గంతలు కట్టుకొని ఉండడంతో డీలర్లు ఇష్టారాజ్యంగా బ్లాక్ మార్కెట్‌కు నిత్యావసర వస్తువుల తరలించి కార్డుదారులకు రిక్త హస్తం చూపిస్తున్నారు. తిరుపతి నగరంలో పలు చోట్ల రేషన్ డీలర్లు కందిపప్పు, చక్కెర ఇవ్వకుండా విక్రయించుకోవడం అధికమైంది. కార్డుదారులు నిలదీస్తే స్టాక్ అయిపోయిందని సమాధానం చెబుతున్నారు. కొన్ని రేషన్ షాప్‌ల అయితే కందిపప్పు, చక్కెర ఇవ్వకుండా కేవలం బియ్యం ఇచ్చి కార్డుదారులను వెనక్కి పంపుతున్నారు. పౌర సరఫరాల శాఖ అధికారికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతోంది. వైసిపి ప్రభుత్వంలో అడ్డు అదుపు లేకుండా రేషన్ డీలర్లు కూటమి ప్రభుత్వం వచ్చినా ఇలాగే వ్యవహరించడం పట్ల కూటమి ప్రభుత్వంపై ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తిరుపతిలో పలు గోడౌన్లు, రేషన్ షాప్‌లను సందర్శించి అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. అయినా వారిలో ఏ మాత్రం మార్పు రాకపోవడం గమనార్హం.

తిరుపతి జిల్లాలో ఇటీవల ఎండీయూ వాహనం ద్వారా బియ్యం పంపిణీని తూనికలు, కొలతల శాఖ ఇన్ స్పెక్టర్ మల్లేశ్వర్ వాహనంలో తూకాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి 15 కిలోలకు 500 గ్రాములు తక్కువ ఉండటాన్ని గుర్తించారు. ఆపరేటర్లపై కేసు నమోదు చేసి రూ.2 వేల జరిమానా విధించారు. జిల్లా కేంద్రంలో వేయింగ్ మిషన్లపై యథేచ్ఛగా డబ్బాలు పెట్టి.. బియ్యం పంపిణీ చేస్తున్నారు. దీంతో ప్రతి ఒక్క కార్డుదారుడి నుంచి కిలో, రెండు కిలోలు చొప్పున తస్కరిస్తున్నారు. లబ్దిదారులు ప్రశ్నించలేక పోతుండడంతో అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గత ప్రభుత్వం పాలనలో ప్రజాపంపిణీ వ్యవస్థ గాడి తప్పింది.. అవినీతి, అక్రమాలకు అడ్డాగా మారింది. అధికార పగ్గాలు చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రక్షాళన దిశగా చర్యలు చేపట్టింది. బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తూ పారదర్శకత పెంచాలని సీఎం, డిప్యూటీ సీఎం పదేపదే ఆదేశిస్తున్నా క్షేత్ర స్థాయిలో మార్పు రావడం లేదు. పౌరసరఫరాల, రెవెన్యూ శాఖ నిర్లక్ష్యంతో పేద, నిరు పేదలు దోపిడీకి గురవుతున్నారు. డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు తూకాల్లో మోసాలకు పాల్పడుతూ పెద్ద మొత్తంలో బియ్యాన్ని నొక్కేస్తున్నారు. కందిపప్పు స్టాక్ లేదంటూనే బయోమెట్రిక్ వేయించుకుని పక్కదారి పట్టిస్తున్నారు.

ప్రజా పంపిణీ బియ్యం గోదాముల నుంచి మండల నిల్వ కేంద్రాలకు.. అక్కడి నుంచి చౌక దుకాణాల డీలర్లకు సరఫరా చేస్తారు. ప్రతినెల ఎనిమిది వేల టన్నుల బియ్యం కార్డుదారులకు అందిస్తారు. ఇంటికే రేషన్ బియ్యం పేరుతో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ నామమాత్రంగానే మిగిలింది. 60 శాతం పంపిణీ చౌకదుకాణాల ద్వారానే కొనసాగుతోంది. కొందరు డీలర్లు డబ్బాలో పోసి.. ఆ డబ్బా వేయింగ్ మిషన్‌పై పెట్టి లబ్దిదారులకు అందిస్తున్నారు. డబ్బా ఒక కిలో బరువు ఉంటుంది. 20 కిలోల పంపిణీకి రెండుసార్లు డబ్బా ద్వారా అందిస్తున్నారు. జిల్లా కేంద్రం లోనే ఇలా ఉంటే.. ఇక మండలాలు, గ్రామాల్లో రెండు మూడు కిలోల వరకు ఉంటోంది. కందిపప్పు చాలాచోట్ల లబ్ధిదారులు కళ్లచూడని దుస్థితి.

వారు వీరు కుమ్మక్కుతో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు కుమ్మక్కై బియ్యం దోపిడీకి పాల్పడుతున్నారు. చాలా ప్రాంతాల్లో ఎండీయూ వాహనాలను నడప కుండా చౌక దుకాణం ఎదుటే పంపిణీ చేస్తూ దోచేస్తున్నారు. దుకాణంలో నిల్వ చేసి రాత్రివేళ పక్కదారి పట్టిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో వ్యాపారులు దుకాణం ఎదుటే తిష్టవేసి లబ్ధిదారుల నుంచి కిలో రూ.15-18 చొప్పున కొనుగోలు చేసి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

జిల్లా అంతటికీ ఒక్కడే..

సీఎం ప్రాతినిధ్యం వహించే చోట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తప్ప 31 మండలాల్లో ఒక్క సీఎస్‌డీటీ లేరు. కనీసం డీఎస్ఓ కార్యాలయంలో అటెండరు లేదంటే.. పాలనా పరిస్థితి ఎలా వుందో అర్థమవుతోంది. సీఎస్‌డీటీలు, అటెండరును నియమించాలంటూ పలుమార్లు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆ శాఖ అధికారి వాపోతున్నారు. తిరుపతి ఏఎస్ఓ కార్యాలయంలో డిటి తప్ప అటెండర్ లేని పరిస్థితి నెలకొంది. సిబ్బంది కొరతతో సతమతమవుతున్నారు.

ప్రతినెల నిత్యావసరాల సరఫరా (టన్నుల్లో)
బియ్యం -8,326
కందిపప్పు -389
చక్కెర - 285
బియ్యం కార్డుదారులు - 5.26 లక్షలు
ఎండీయూ వాహనాలు- 269
చౌక దుకాణాలు - 1.457

పుస్తక ప్రదర్శనపై దాడి

- మతోన్మాదులను అరెస్టు చేయాలి..
- సిపిఎం, సిపిఐ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్, తిరుపతి సిటీ: తిరుపతి నగరంలోని ఇస్కాన్ పక్కనే వున్న టిటిడి గ్రౌండ్‌లో భారతీయ విద్యా భవన్ ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనపై మతోన్మాద గూండాలు శనివారం 8 గంటల ప్రాంతంలో పుస్తకాలయాలపై దౌర్జన్యానికి, దాడికి పాల్పడ్డారు. ఈ దౌర్జన్యాన్ని ఆపాలని కోరిన సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజుపై దురుసుగా ప్రవర్తిస్తూ అసభ్య పదజాలంతో దూషించారు. విశాలాంధ్ర పుస్తకాలయం వద్దకు వచ్చిన మతోన్మాద గూండాలు కిరణ్‌కుమార్, తుమ్మ ఓంకార్‌లు 'పెరియార్ జీవిత చరిత్ర పుస్తకాలు తొలగించండి..' అంటూ హుకుం జారీ చేశారు. ప్రశాంతంగా ప్రజలు పుస్తకాలయంలో సంతోషంగా పుస్తకాలు కొనుగోలు చేస్తున్న సందర్భంలో మతోన్మాద గూండాలు గుంపుగా చేరి పుస్తకాలపై అవాకుల చవాకుల పేలుతూ దౌర్జన్యానికి దిగారు. స్థానికులు, కవులు, రచయితలు, మేధావులపై దురుసుగా ప్రవర్తించి దాడికి పూనుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళిలు మాట్లాడుతూ తిరుపతి నగరంలో ప్రశాంత వాతా వరణాన్ని కలుషితం చేస్తూ హిందూమత సామరస్యానికి కళంకం తెచ్చారని, ఇలాంటి వారికి కొందరు భయపడి ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రచన స్వేచ్ఛను, భావాల స్వేచ్ఛను స్వాతంత్ర్యం నాటి భావాలను తుద ముట్టించడానికి ఇలాంటి రౌడీ మూకలు పూనుకుంటున్నాయని, దీనికి వ్యతిరేకంగా తిరుపతి ప్రశాంతతను కాపాడేందుకు ప్రజలందరూ సిద్ధం కావాలని వామపక్షాల తరఫున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఇదే పద్ధతి కొనసాగితే ప్రజలే వీరికి తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. పోలీసులు వెంటనే వారిని అరెస్టుచేసి తగిన చర్యలు తీసుకుని వీరి ఆగడాలు అరికట్టాలని కోరారు.

వెటర్నరీ వైద్య విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి..

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు వినతి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయూష్ వైద్య విద్యార్థులకు అందిస్తున్న విధంగానే తమకూ స్టయిఫండ్ ఇచ్చేలా కృషి చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవితను ఏపీ వెటర్నరీ స్టూడెంట్స్, గ్రాడ్యుయెట్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. శనివారం బీసీ సంక్షేమ పథకాల అమలు తీరుతెన్నులపై సమీక్షించడానికి వచ్చిన మంత్రి సవితను నగరంలోని పద్మావతి గెస్ట్ హౌస్ లో వెటర్నరీ వైద్య విద్యార్థులు కలిసి వినతిపత్రం అందించారు. ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయూష్ వైద్య విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఎత్తున స్టయిఫండ్ పెంచి ఇస్తోందన్నారు. వారి మాదిరిగానే తమకూ స్టయిఫండ్ వచ్చేలా కృషి చేయాలని, ఈ విషయం సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లాలని వారు మంత్రిని కోరారు. అనంతరం పలు సమస్యల పరిష్కరించాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధిలో తమ పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. దీనిపై మంత్రి సవిత స్పందిస్తూ, వెటర్నరీ వైద్య విద్యార్థుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ వెటర్నరీ స్టూడెంట్స్, గ్రాడ్యుయెట్స్ అసోసియేషన్ ప్రతినిధులు పి.నష్వర్ ఖాన్, కేవీ ధర్మతేజ, ఎం.గుణ కౌశిక్, లోకేశ్ సాయి, రమేశ్, జితేంద్రనాయుడు పాల్గొన్నారు.


మంత్రి సవితకు వినతిపత్రం అందిస్తున్న ఏపీ వెటర్నరీ స్టూడెంట్స్, గ్రాడ్యుయేషన్ ప్రతినిధులు

26 ఎర్ర చందనం దుంగలు స్వాధీనం

ముగ్గురు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధిలోని రేణిగుంట – కడప హైవే సమీపంలోని రిజర్వు ఫారెస్ట్ ప్రాంతంలో భూమిలో డంపు చేసిన ఎర్రచందనం దుంగ లను రహస్యంగా తవ్వి తీసి మరో ప్రాంతానికి తరలి స్తుండ గా ముగ్గురు నిందితులను అరెస్టుచేసి 26 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసు కున్నామని తిరుపతి రేంజి అటవీ క్షేత్రాధికారి బి సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ ఆదేశాలతో శుక్రవారం రాత్రి అందిన రహస్య సమాచారం మేరకు అప్రమత్తమై సిబ్బందితో కలిసి కరకంబాడి వద్ద ఉన్న రైల్వే బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. రాత్రి పది గంటల సమయంలో రెండు ద్విచక్ర వాహనాలలో అక్కడికి వచ్చిన నలుగురు వ్యక్తులు దాచి ఉంచిన ఎర్రచందనం దుంగలను బయటకు తీస్తుండగా వారిని చుట్టుముట్టి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిలో రఘు అనే వ్యక్తి పారిపోయాడని అతని కోసం గాలిస్తున్నామని తెలిపారు. రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, పట్టుబడిన ఎర్రచందనం దుంగల విలువ 25 లక్షల రూపాయలు ఉంటుందని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ దాడులలో తిమ్మ నాయుడుపాలెం సెక్షన్ ఎఫ్ఎస్ఓ రమేష్ బాబు, ఎఫ్‌బిఓ వెంకటేశ్వరరావు, కిషోర్ కుమార్, సురేష్ బాబు, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.


ఫారెస్టు అధికారుల అదుపులో నిందితులు.. స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం

శ్రీరామకృష్ణ తీర్థ ముక్కోటి ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి -తిరుమల: తిరుమలలో ఈ నెల 12వ తేది నిర్వహించనున్న శ్రీరామకృష్ణ తీర్థ ముక్కోటి ఏర్పాట్లపై టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి శనివారం తిరుమల గోకులం సమావేశ మందిరంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలలో జరిగే అతి ముఖ్యమైన తీర్థ ఉత్సవాలలో ఒకటైన రామకృష్ణతీర్థ ముక్కోటికి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. యాత్రికుల కోసం రేడియో బ్రాడ్‌కాస్టింగ్ ద్వారా ప్రకటనలు, డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. టీటీడీ భద్రతాసిబ్బంది, పోలీసుల సమన్వయంతో భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. అనంతరం, అన్నప్రసాదం, తాగునీరు, వైద్యం సదుపాయాలు, అటవీ శాఖల ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. అధిక బరువు, ఆస్తమా, గుండె సంబంధిత సమస్యలు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న యాత్రికులను, వృద్ధులను, పది ఏళ్లలోపు చిన్నారులను అనుమతించబోమని తెలిపారు. గోగర్భం డ్యామ్ పాయింట్ నుండి పాపవినాశనం వరకు యాత్రికులను తరలించేందుకు ఆర్టీసీ పెద్ద సంఖ్యలో బస్సులను ఏర్పాటు చేస్తోంది. ఫిబ్రవరి 12వ తేదీ ఉదయం 5 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే యాత్రికులను ఈ తీర్థానికి అనుమతిస్తారు. ఈ సమావేశంలో ఈఈ సుబ్రహ్మణ్యం, విజిఓ సురేంద్ర, డీఎఫ్ఓ శ్రీనివాసులు, తిరుమల పోలీసు ఉన్నతాధికారులు, ఇతరులు పాల్గొన్నారు.


శ్రీరామకృష్ణ ముక్కోటి తీర్థం ఏర్పాట్లను సమీక్షిస్తున్న టిటిడి అదనపు ఈవో

పదకొండు దాటితే పని పడతాం: డిఎస్‌పి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో రాత్రి పదకొండు గంటలు దాటి దుకాణాలు నిర్వహించినా, సరైన కారణం లేకుండా వీధుల్లో సంచరించినా చర్యలు తప్పవని శ్రీకాళహస్తి డిఎస్పి నరసింహమూర్తి హెచ్చరించారు. ప్రజా భద్రత దృష్ట్యా సదరు నిర్ణయాన్ని కఠినంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం డీఎస్పీ మీడియా సమావేశం నిర్వహించారు. ప్రజా భద్రత, నేరాల అదుపు దృష్ట్యా పట్టణంలో రాత్రి పదకొండుపైన ఎవరూ దుకాణాలు నిర్వహించొద్దని సూచించారు. సరైన కారణాలు లేకుండా బయట సంచరించకూడదని తెలిపారు. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలను తమ ఇళ్లు, దుకాణాల వద్ద ఏర్పాటు చేసుకోవాలన్నారు. లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయ భాగస్వామ్యంతో పట్టణంలో పలు చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. శాంతి భద్రత లను కాపాడడంలో పోలీసులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వన్ టౌన్ సీఐగోపి, టూ టౌన్ సీఐ వెంకటేశులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీకాళహస్తి డిఎస్‌పి నరసింహమూర్తి

పెండింగ్ బిపిఎస్ ఎల్ఆర్ఎస్‌కి దరఖాస్తు చేసుకోండి: కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో పెండింగ్‌లో ఉన్న బిపిఎస్, ఎల్ఆర్ఎస్‌కి దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ ఎన్ మౌర్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019 వ సంవత్సరంలో దరఖాస్తు సమర్పించి ఇప్పటికీ క్రమబద్ధీకరణ కాకుండా పెండింగ్‌లో ఉన్న అర్జీదారులకు మార్చి 31 వ తేదీవరకు మరో అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. 2020వ సంవత్సరంలో ప్రభుత్వం జారీచేసిన లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీం–2020లో అనుమతిలేని లేఔట్లు, ప్లాట్లు క్రమబద్ధీకరించుకోవడానికి మరో అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. భవనాలు క్రమబద్ధీకరించుకోవడం వల్ల ప్రత్యేకంగా ఆక్యుపె న్సీ సర్టిఫికెట్ పొందవలసిన అవసరం లేదని, భవిష్యత్తులో భవన నిర్మాణ ఫీజులో మినహాయింపు ఉంటుందని, ఆస్తిపన్నుపై ఎలాంటి పెనాల్టీ ఉండదని తెలిపారు. ఎల్ఆర్ఎస్ ను 2007 తరువాత తిరిగి అమలులోకి తెచ్చారన్నారు. లేఔట్ల, ప్లాట్లు క్రమబద్ధీకరించుకోవడం వల్ల14 శాతం ఓపెన్ స్పేస్ ఛార్జీలు మినహాయింపు ఉంటుందని, పీనల్ ఛార్జీల నుండి మినహాయింపు ఉంటుందని, రోడ్డు, యాజమాన్య హక్కులు ధృవీకరిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ తెలిపారు.

నేడు ఐసిఎంఎఐ ఆధ్వర్యంలో ఆస్పైర్ - 2025

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): నేడు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇందిరా ప్రియదర్శిని సిల్వర్ జూబ్లీ ఆడిటోరియం వేదికగా కామర్స్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైన నిపుణుల సలహాలతో నిర్వహించే ఆస్పైర్ – 2025 మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తిరుపతి చాప్టర్ ఛైర్మన్ డాక్టర్ సీఎంఏ పార్థసారథి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా ఐసిఎంఎఐ అధ్యక్షులు సీఎంఏ బిభుతి భూషణ్ నాయక్, ఉపాధ్యక్షులు టిసిఏ సీఎంఏ శ్రీనివాస ప్రసాద్, సీసీఎం సీఎంఏ వినయ్ రంజన్, ఎస్ఐఆర్‌సి ఛైర్మన్ సిఎంఎ విశ్వనాథ బట్ హాజరై కామర్స్ విద్యార్థులకు భవిష్యత్తులో ఎంతో ఉపయుక్తమైన సూచనలను ఇవ్వనున్నారన్నారు. ఉదయం 9 గంటల నుండి 1 గంట వరకు ఈ ఆస్పైర్ – 2025 కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇప్పటికే వెయ్యి మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి రావడానికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకున్నారని, కార్యక్రమానికి రావాలనుకున్న విద్యార్థులు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని, అందుకోసం 9032517501 నెంబరును సంప్రదించాలన్నారు.

కేన్సర్‌పై అవగాహనే నివారణకు మార్గం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: కేన్సర్ వేగంగా విస్తరిస్తున్న నేటి పరిస్థితుల్లో వ్యాధి పట్ల అవగాహనే నివారణరకు మార్గమని శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కేన్సర్ కేర్ అండ్ రీసెర్చ్ టాటా ఫౌండేషన్ అంకాలజీ డాక్టర్ పి మస్తాన్ సాహెబ్ పేర్కొన్నారు. శనివారం ఉదయం యల్‌బిసి రోడ్డు లోని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నెలవారీ సమావేశం సందర్భంగా శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కేన్సర్ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించి పలువు రికి వైద్య పరీక్షలు నిర్వహించి కేన్సర్‌పై అవగాహన కల్పించారు. డాక్టర్ పి మస్తాన్ సాహెబ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఏడాదికి రెండు లక్షల మంది కేన్సర్ వ్యాధికి గురి అవుతున్నట్లు తెలిపారు. వ్యాధి మొదటి దశలో గుర్తిస్తే చికిత్స ద్వారా పూర్తిగా నయం చేయడం, జీవిత ప్రమాణాలు కూడా యథా తతంగా వుంటాయని పేర్కొన్నారు. మెడికల్ క్యాంపులో డాక్టర్ వి వెంకయ్య బాబు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ వి రెడ్డి కుమారీ, స్టాఫ్ నర్స్ పి మెహతాజ్ , సిబ్బంది రమేష్ బాబు , మహీంద్రా పాల్గొన్నారు.

ఒక్కడి కోసం..అంతా..!

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతి కార్పొరేషన్‌లో ఒక్కే ఒక్కడు కూటమికి చెందిన కార్పొరేటర్.. ఎలాగైన డిప్యూటీ స్థానాన్ని దక్కించు కోవాలనుకున్నారు. కూటమి పార్టీలన్ని కలిసి పావులు కదిపాయి. ప్రతిపక్ష వైసిపి పాచికలు పారలేదు. అధికార యంత్రాంగం ఎదుటే అందర్ని తమవైపునకు తిప్పుకున్నారు. రెండు, మూడు రోజుల హైడ్రామా తర్వాత, ఎన్నికల అధికారి ముందు మెజార్టీ కార్పొరేటర్లు ఆ ఒక్కడికి మద్దతుగా చేతులెత్తారు. ఎట్టకేలకు డిప్యూటీని కైవసం చేసుకున్న కూటమి వైసిపి రాజకీయ దురంధరుడికి చుక్కలు చూపించడం గమనార్హం.

ఆ ఒక్కరి కోసం..నలుగుర్ని కిడ్నాప్ చేసి.. మేధావివర్గం నుంచి ఎంపికైన శాసన మండలి సభ్యుడిని రహస్య ప్రాంతంలో ఉంచి, సాక్షాత్తు కార్పొరేషన్ ప్రథమ మహిళను మహిళా అని కూడా చూడకుండా దుర్భాషలాడి, దాడి చేసి, పార్లమెంట్ సభ్యుడిని కిందపడదోసి, మహిళా కార్పొరేటర్లు ఈడ్చుకెళ్లి అదో పెద్ద థ్రిల్లర్ సినిమా షూటింగ్‌ను తలదన్నేలా చేసి, సాక్షాత్తు పోలీసులు, జిల్లా పాలనాయంత్రాంగం ఎదుటే వాహనాల్లో కుక్కి, బెదిరించి, ఎట్టకేలకు పదవి దక్కించుకుని, తాము అనుకున్నది సాధించుకుంది పాలకపక్షం. అదేదో ఎంఎల్‌సియో, ఎంపియో, ఎంఎల్ఏ పదవో కాదు..!, తిరుపతి నగర డిప్యూటీ మేయర్ స్థానం.. అందునా ఇప్పటికే ఒకటి ఉండగా, అంతగా ప్రాధాన్యత లేని రెండో డిప్యూటీ స్థానం కోసం.. బూర్జువా రాజకీయ పార్టీలు పదవుల కోసం ఎంతకైనా తెగిస్తారన్న దానికి తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక ఒక నిదర్శనం. అసలేమి జరిగిందో వివరాల్లోకి వెళ్లితే... తిరుపతి కార్పొరేషన్‌లో 50 డివిజన్లు ఉన్నాయి. 49 డివిజన్లకు ఎన్నికలు జరగగా, ఒక డివిజన్ కోర్టు కేసు వల్ల ఎన్నిక వాయిదా పడింది. 49 మంది కార్పొరేటర్లలో ఒక కార్పొరేటర్ మాత్రమే టిడిపి తరపున గెలుపొందారు. మిగిలిన 48 మంది వైసిపి కార్పొరేటర్లే.. తిరుపతి మేయర్‌గా ప్రముఖ వైద్యురాలు డాక్టరు శిరీషాను, డిప్యూటీ మేయర్లుగా భూమన అభినయ్‌రెడ్డి, ముద్ర నారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలా మూడున్నర సంవత్సరాలు గడిచిపోయాయి. రాష్ట్రంలో టిడిపి, బిజెపి, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్నికల సందర్భంగా డిప్యూటీ మేయర్ పదవికి భూమన అభినయ్‌రెడ్డి రాజీనామా చేశారు. సాధారణ ఎన్నికల అనంతరం ఖాళీగా ఉన్న మున్సిపల్ ఛైర్మన్లు, డిప్యూటీ ఛైర్మన్లు, కార్పొరేషన్ మేయర్లు, డిప్యూటీ మేయర్ల స్థానాలకు ఎన్నికల నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా తిరుపతి రెండవ డిప్యూటీ మేయర్ స్థానానికి కూడా నోటిఫికేషన్ ఇచ్చింది. ఒకరు రాజీనామా, మరో కార్పొరేటర్ మృతి చెందిన కారణంగా తిరుపతి కార్పొరేషన్‌కు 47 మంది కార్పొరేటర్లు మిగిలారు. అందులో కూటమి పార్టీ అయిన టిడిపికి చెందిన ఒక కార్పొరేటర్ మినహా అందరూ వైసిపి కార్పొరేటర్లే. ఇక్కడే అసల కథ ప్రారంభమైంది. తమకు ఏ మాత్రం బలం లేని చోట తమ ప్రతాపం చూపించింది కూటమి.. ఎన్నికలకు వారం ముందే క్యాంప్ రాజకీయాలు నడిచాయి. 3వ తేదీ ఎన్నిక జరగనుండగా రెండవ తేది రాత్రి కార్పొరేటర్ల క్యాంప్ చిత్తూరుకు మారింది. అంతే కూటమి నాయకులు ఆఘమేఘాలమీద అక్కడికి చేరుకుని అధికార అండతో కార్పొరేటర్లను భయభ్రాంతులకు గురిచేసి, తమకు అనుకూలంగా వ్యవహరించాలని హెచ్చరించారు. ఈ విషయం ఎలాగోలా తెలుసుకున్న వైసిపి నాయకులు భూమన అభినయ్ చిత్తూరుకు చేరుకుని కూటమి నాయకులతో ఘర్షణకు దిగారు. ఇరు వర్గాలు వెనక్కు తగ్గడంతో సీన్ అక్కడికి కట్ అయింది. తిరుపతిలో డిప్యూటీ మేయర్ ఎన్నిక జరిగే ఎస్‌వి సెనేట్ హాల్ వద్ద కూటమీ నాయకులు మకాం వేశారు. కార్పొరేటర్లు ఎక్కడున్నా అక్కడికి రావాల్సిందే అన్నది వారి ఆలోచన.. మరోపక్క వైసిపి ఉద్దేశ పూర్వకంగానే ఆలస్యం చేసింది. ఎట్టకేలకు ఎస్‌వియుకు చేరుకున్న వైసిపి కార్పొరేటర్లను బస్సు దిగకుండా కూటమి నేతలు అడ్డుకున్నారు. ప్రశ్నించిన ఎంపిని కింద పడదోశారు. మేయర్‌ను నానా దుర్భాషలాడుతూ దాడికి యత్నించారు. మహిళా కార్పొరేటర్లను ఈడ్చిపడేశారు. పోలీసులు, జిల్లా పాలనాధికారులు ఎదుటే నలుగురు కార్పొరేటర్లను బలవంతంగా ఎత్తుకెళ్లారు. మరో పక్క కోరం లేక ఎన్నిక మరుసటి రోజుకు వాయిదా పడింది. అక్కడి నుంచి అసల కథ మొదలైంది. 26 మంది మద్దతు కోసం కూటమి రకరకాల ప్రయత్నాలు చేసింది. ఆఖరికి శాసనమండలి సభ్యున్ని సైతం రకరకాల కారణాలు చెప్పి ఊరికి దూరంగా తీసుకెళ్లి, ఓటింగ్‌కు దూరంగా ఉంచింది. ఆ రాత్రంతా కార్పొరేటర్లకు బెదిరింపులు, వారి కుటుంబ సభ్యులకు హెచ్చరికలు తప్పలేదు. ఎట్టకేలకు 4వ తేది ఉదయం సెనేట్ హాల్‌లో కూటమి అభ్యర్థికి అనుకూలంగా 26 ఓట్లు రావడంతో ఎన్నికల అధికారి టిడిపికి చెందిన అభ్యర్థి గెలిచినట్లు ప్రకటించారు. అంతగా ప్రాధాన్యత లేని రెండవ డిప్యూటీ మేయర్‌కోసం ఇంతలా వ్యవహరించాలా? అని ప్రజలు బహిరంగంగానే విమర్శలు చేశారు. గతంలో వైసిపి చేసిన అరాచకాలు, రౌడియిజాన్నే తాము అనుచరించామని తప్పేముందని పాలకపక్షం చెప్పకోవడం కొసమెరపు. ఏది ఏమైనా బూర్జువ పార్టీలు తమ పదవుల కోసం ఎంతకైనా తెగిస్తాయని, అందుకు డిప్యూటీ మేయర్ ఎన్నికే నిదర్శనమని పలువురు మేధావులు, ప్రజలు గుసగుసలాడుకోవడం గమనార్హం.

నాణ్యతా లోపం

- కుళ్లిన ఆహార పదార్థాలు విక్రయం
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం
- మారని వ్యాపారుల తీరు


కుళ్లిన ఉల్లిపాయలతో విక్రయిస్తున్న బజ్జీలు

ప్రజాశక్తి -నాయుడుపేట: వ్యాపారులు నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదు. కుళ్లిన ఆహార పదార్థాలు విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. సంబంధిత ఆహార పదార్థాల నాణ్యత తనిఖీ అధికారులు స్పందించకపోవడంతో వ్యాపారులు నాణ్యత ప్రమాణాలు లేని ఆహార పదార్థాలు యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. నాయుడుపేట పట్టణంలో ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో శనివారం ఎదురైన సంఘటనే ఇందుకు నిదర్శనం..తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలో కొందరు వ్యాపారులు కుళ్లిన ఆహారాన్ని విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. నాయుడుపేట పరిధిలో కంపెనీల కారణంగా జనాభా సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ఎక్కువ శాతం జనాభా ఫాస్ట్ ఫుడ్స్, కేఫ్‌లపై మక్కువ చూపుతుండడంతో అందుకు అనుగుణంగా పట్టణంలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్, కేఫ్ లు ఇలా అనేక వ్యాపారాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వ్యాపారులు ధనార్జనకే ప్రాధాన్యతనిస్తూ నాణ్యత శుభ్రతలపై దృష్టి పెట్టడం లేదు. ప్రజల ఆరోగ్యాలను ఏ మాత్రం పట్టించుకోకుండా కుళ్లిన, పాడైపోయిన ఆహారాలను అలాగే విక్రయిస్తున్నారు. నాయుడుపేట మున్సిపాల్టీ అయినప్పటికీ హెల్త్ డిపార్టుమెంట్‌కి సంబంధించిన అధికారులు లేకపోవడంతో వ్యాపారస్తులను ఆపేవారు, అడిగే వారే కనుమరుగయ్యారు. ఆ ధైర్యంతో వ్యాపారస్తులు మరింత దారుణంగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. నాయుడుపేట బస్టాండ్ పరిధిలో ని గుడ్ మార్నింగ్ కేఫ్ లో శుభ్రత నియమాలు పాటించకుండా ఇష్టానుసారంగా కుళ్లిన పదార్థాలను విక్రయిస్తున్నారు. ఈ గుడ్ మార్నింగ్ కేఫ్ ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా ఎక్కువ జన సంచారం ఉన్నచోట ఉండడంతో ఎక్కువగా ప్రయాణికులే ఆ కేఫ్‌కి వెళుతుంటారు. చూసేందుకు చిన్నదిగా ఉన్నా ఎప్పుడూ రద్దీగానే ఉంటుంది ఇంత రద్దీగా ఉన్న ఈ కేఫ్‌ను ఇంతవరకు హెల్త్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ కేఫ్ నిర్వహణపై ఎవరైనా హెల్త్ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నా హెల్త్ అధికారులకు సంబంధించిన సమాచారం ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో వీరు యథేచ్ఛగా వ్యాపారం కొనసాగిస్తున్నారు. హెల్త్ అధికారులు వారు ఉన్నారని చెప్పుకునేందుకే.. ఎప్పుడో ఒకసారి నాయుడుపేటలో హోటల్స్‌ను, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లను సందర్శించి గుట్టుచప్పుడు కాకుండా వెళ్లిపోతుంటారు. అధికారులు పారదర్శకంగా తనిఖీలు నిర్వహిస్తే హోటల్స్‌లో, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల లోనూ, ఇలాంటి కేఫ్‌లలో పరిశుభ్రత నియమాలు పాటించే అవకాశం ఉండేది. ఈ కేఫ్‌ను కేరళకు చెందిన మలయాళీలు నిర్వహిస్తున్నారు. వీరికి అనేకచోట్ల చాలానే బ్రాంచ్‌లు ఉన్నాయి. ఈ కేఫ్‌లో టీ, కాఫీ లతో పాటు బోండా, బజ్జీలు, వడలు, స్వీట్స్ అన్నీ విక్రస్తుంటారు. శనివారం వీరి కేఫ్ లో విక్రయిస్తున్న బజ్జీలలో పెట్టిన ఉల్లిపాయలు కుళ్లిపోయి ఉన్నాయి. వాటిని వీళు అలానే అమ్ముతున్నారు. 'ఇలా పాడైపోయిన ఆహారం ఎందుకు అమ్ముతున్నారు?' అని ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పక పోవడం గమనార్హం. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ ఎస్‌కే ఫజిలుల్లా దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందిస్తూ ఇక్కడ మున్సిపాల్టీలో, హెల్త్ డిపార్టుమెంట్‌కు సంబంధించిన అధికారులు లేరని జిల్లా అధికారులకు సమాచారం అందిస్తానన్నారు. హెల్త్ డిపార్టుకుమెంటుకు సంబంధించిన సమాచారాన్ని ప్రతి ఫుడ్ షాపులలో ఉండేలా చర్యలు చేపడతామని తెలిపారు. పై స్థాయి అధికారులు స్పందించి కేఫ్‌లు, హోటళ్లపై చర్యలు చేపట్టి అధికారుల సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచి తమ ఆరోగ్యాలపై శ్రద్ధ చూపాలని ప్రజలు కోరుకుంటున్నారు.

సూర్య ఘర్ యోజన మేళా ప్రారంభం



సూర్య ఘర్ యోజన మేళాకు విచ్చేసిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతిలో మూడు రోజులు పాటు నిర్వహించనున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్తా బిజిలి యోజన పథకంపై అవగాహన మేళాను తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిలు శనివారం ప్రారంభించారు. స్థానిక ఎస్పీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మేళాలో వివిధ కంపెనీలు సోలార్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుతో సొంతంగా వినియోగదారులే విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చని, కేంద్రం ఇస్తున్న సబ్సిడీ పొందడమేకాక, బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. వివిధ బ్యాంకుల ఋణ సౌకర్యం కల్పిస్తున్నాయని తెలిపారు. ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిజి.ఎమ్‌లు రమాణ దేవి, వర కుమార్, ఓ.ఎస్. డి.ముని శంకరయ్య, డి.ఈ.టీ.వాసవిలత, ఆపరేషన్ టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్ర శేఖర్ రావ్, ఈఈ పీ.బాలాజి, రూరల్ డివిజన్ ఏడి.లు, ఏ.ఈ.లు, విద్యుత్ ఉద్యోగులు, వినియోగదారులు పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి



ప్రదర్శనకు విచ్చేసిన ఎమ్మెల్యే పాశింకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్వతంత్ర్య పోరాటంలో మహనీయులు చేసిన త్యాగాలు నేటి తరానికి తెలియజేయాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహ్మద్ సౌజన్యంతో ఫ్రీడమ్ ఫైటర్స్ ఎక్స్పో నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలు ముస్లిం సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు, డీఆర్ డబ్ల్యూ మహిళా కళాశాల ప్రిన్సిపల్ హనుమంతరావు, ఎం. అబ్దుల్ సాలార్, ఎండీ అబ్దుల్ రహీం, ఎస్కే. కాలేషా, రషీద్, , షఫీ మౌలానా, ఎండీ. అన్వర్ బాష, యస్థాని భాయ్, షేక్ రియాజ్ అహ్మద్ , ఇలియాజ్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, ఎండీ. అబ్దుల్ రహీం, ఇజ్రాయెల్ కుమార్, జహంగీర్, ఎండీ. నాజర్, పెంచలయ్య, జీలానీబాషా, సద్దాం హుస్సేన్, అల్లీ హుస్సేన్, శ్రీనివాసులు, ముర్తుజ, మగ్దూమ్ మొహిద్దున్, జలీల్ , తదితరులు పాల్గొన్నారు.


గోయాజ్ సిల్వర్ జ్యువెలరీ షోరూం ప్రారంభం



షోరూం ప్రారంభిస్తున్న సినీ నటి మీనాక్షి చౌదరి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ప్రముఖ సిల్వర్ జువెలరీ యాజమాన్యం గోయాజ్ తిరుపతిలో ఏర్పాటు చేసిన నూతన షో రూమ్‌ను ప్రముఖ సినీ హీరోయిన్ మీనాక్షి చౌదరి శనివారం ప్రారంభించారు. స్థానిక వివి మహల్ రోడ్‌లో ఏర్పాటుచేసిన షోరూమును ప్రారంభించి, జ్యోతి ప్రజ్వలన చేసిన ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ప్రముఖ గోయాజ్ సిల్వర్ జువెలరీ సంస్థ తమ ఎనిమిదవ షోరూమ్ తిరుపతిలో ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు, సిబ్బంది, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.


ఘనంగా రెయిన్‌బో స్కూల్ వార్షికోత్సవం



చిన్నారికి ప్రశంసా పత్రం అందిస్తున్న యాజమాన్యం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: రెయిన్‌బో స్కూల్ వార్షికోత్సవాన్ని శనివారం మహతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ ఎన్ బి. సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర వ్యక్తి నిర్మాణం విద్యా లక్ష్యం కావాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ఏర్పాటుచేసిన సాంస్కృతి కార్యక్రమాలు అలరింపచేశాయి. ఈ కార్యక్రమంలో ఆ స్కూల్ కరస్పాండెంట్ పి.అతుల్ ఖాన్, ప్రిన్సిపాల్ ఎస్ కె. షాహీర్ భాను, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్టైఫండ్ పెంచేంతవరకు సమ్మె విరమించం



మంత్రి నారాయణకు పశువైద్య కళాశాల విద్యార్థుల వినతి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలో విద్యార్థుల నిరువదిక సమ్మె ఆరో రోజుకు చేరింది. రిలే నిరాహార దీక్ష రెండో రోజు శనివారం కొనసాగుతోంది. కొందరు విద్యార్థులు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణని మంగళగిరి టిడిపి ప్రధాన పార్టీ కార్యాలయంలో కలిసి తమ సమస్యను వివరించారు. ఇతర వైద్య కోర్సులతో సమానంగా స్టైఫండ్ పెంచాలనే తమ ప్రధాన డిమాండ్ నెరవేరే వరకు సమ్మెను విరమించబోమని విద్యార్థులు స్పష్టం చేశారు. శనివారం మధ్యాహ్నం జనసేన పార్టీ కార్యాలయం వద్ద విద్యార్థుల ప్రతినిధులు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుని కలుసుకొని తమ సమస్యను వివరించా రు. విద్యార్థులకు న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పశువైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సు రాదు బిడ్డో.. మన ఊరి బస్టాండుకు



- బస్టాండుకు బస్సు వస్తే ఒట్టు
- మరమ్మతులకు నోచుకోని బస్టాండ్
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు

పాడుబడ్డ స్థితిలో ఆర్‌టిసి బస్టాండ్





రోడ్లపైనే బస్సు ఎక్కుతున్న ప్రయాణీకులు

ప్రజాశక్తి - కే వి బి పురం: కెవిబి పురం మండల కేంద్రానికి చుట్టుపక్కల గ్రామ ప్రజలకు రోజు ఏదో ఒక పనిపై వస్తూ ఉంటారు. వీటిని అన్నిటిని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల సౌకర్యార్థం 2009లో సుమారు 30 లక్షల రూపాయలతో బస్టాండ్ నిర్మించారు. ప్రయాణికులకు ఆ బస్టాండు ఎంతగానో ఉపయోగపడేది. కానీ ఇప్పుడు పశువులకు నివాస స్థలంగా మారింది. అధికారుల నిర్లక్ష్యం వలన బస్సులు బస్టాండుకు రాకపోవడంతో నానాటికి బస్టాండ్ వాడుకలో లేని దుస్థితికి చేరుకుంది. బస్టాండుకు బస్సులు రాక పోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు, ప్రయాణీకులు ఎక్కడ పడితే అక్కడ బస్సులకోసం వేచి చూసి ఎక్కాల్సివస్తోంది. నడిరోడ్లపై బస్సులు ఆపి ఎక్కుతుండటంతో వెనుక వచ్చే వాహనాకలు ఇబ్బంది మాత్రమే కాక, ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశం ఉంది. దీనివాలన ప్రమాదాలు జరిగే అవకాశం వుందని విద్యార్థుల తల్లితండ్రులు ఆందోళన పడుతున్నారు. వృద్ధులు, మహిళలు బస్సులు ఎక్కాలంటే, ఎండకు, వానకు రోడ్లపై పడిగాపులుగాయాల్సి వస్తుంది. ఒకవేళ బస్సు ప్రయాణీకులతో నిండిపోయి ఉంటే ఇంక అంతే సంగతి.. ఆ బస్సు ఆపరు, మరలా బస్సుకోసం వేచిఉండక తప్పది. ఆర్‌టిసి అధికారులు బస్టాండును శుభ్ర చేయించి తిరిగి వాడకంలోకి తేవాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రుల కోరుతున్నారు.

> బస్టాండుకు బస్సుల రాకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రంలో బస్టాండ్ మరమ్మతులకు నోచుకోక సంవత్సరాలు గడుస్తున్న అధికారులు పట్టించుకోకపోవడం లేదు. ఆర్‌టిసి అధికారులు వెంటనే స్పందించి ప్రతి ఒక బస్సు బస్టాండ్ నుండి వెళ్లేలా చూడాలి.
>
> **- నాగరాజ్ , గ్రామస్తుడు**

> బస్టాండ్ వాడుకలో లేకపోవడంతో చెట్లు కింద, షాపుల వద్ద నిలబడుకుంటూ, కూర్చోవడానికి స్థలం లేక బస్సు వచ్చేంతవరకు నిలబడుకొని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. వర్షాకాలం వస్తే వర్షంలో తడుస్తూ గొడుగులు పట్టుకుని నిలవడానికి చోటు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.
>
> **- ఈశ్వరయ్య, గ్రామస్తుడు**

క్రైం న్యూస్

మాజీ సంఘమిత్రలపై చీటింగ్ కేసు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలం, చియ్యవరం పంచాయతీ మాజీ సంఘమిత్రలు మునిలక్ష్మి, మునిశేఖర్ లపై పోలీసులు శనివారం చీటింగ్ కేసు నమోదు చేశారు. వీరు పొదుపు సంఘాల సొమ్ము పెద్ద ఎత్తున స్వాహా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆ మేరకు ఆ గ్రామానికి చెందిన పలు పొదుపు సంఘాల లీడర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.

మోడల్ స్కూల్స్ రీస్ట్రక్చర్‌కు అనుమతి



ఎమ్మెల్యేకు ప్రతిపాదనను వివరిస్తున్న ఉపవిద్యా శాఖ అధికారి బాలాజీ

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): తిరుపతి అర్బన్ మండల పరిధిలో ఉన్న మోడల్ స్కూల్స్‌ను రిస్ట్రక్చర్ చేయడానికి సహాయ సహకారాలు అందించాలని తిరుపతి ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ, తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులను కోరారు. ఈ మేరకు శనివారం కపిలతీర్థం వద్ద ఉన్న ఎమ్మెల్యే నివాసంలో తిరుపతి అర్బన్ మండల పరిధిలోని ఎనిమిది సిఆర్పి హెచ్ఎంలతో కలిసి రీస్ట్రక్చర్ విధివిధానాలను వివరించారు. ఎమ్మెల్యే ఈ ప్రతిపాదనకు అంగీకరించినట్టు ఉప విద్యాశాఖ అధికారి తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీఆర్పీహెచ్ఎంలు మంగళం ట్రెండ్స్ కేశవులు నాయుడు, వంశీ రాజు, మునిశేఖర్, జనార్దన్ రెడ్డి, కృష్ణ కుమార్, ముని శారద పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి - పుత్తూరు, టౌన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం ప్రభుత్వ కార్యాలయాల్లో వినతులు స్వీకరిస్తున్నామని కమిషనర్ మంజునాథ్ గౌడ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు తమ సమస్యలపై పురపాలక సంఘ కార్యాలయం, మీటింగ్ హాల్‌లో ప్రతి సోమవారం నిర్వహించే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మణి నాయుడుకు ఘన సత్కారం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ : వైసీపీ నాయకుల ఆదేశాల మేరకు బుచ్చినాయుడు కండ్రిగ మండల నూతన అధ్యక్షులుగా ఎన్నికైన కె.మణి నాయుడును, పార్టీ శ్రేణులు శనివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మాట్లాడుతూ, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఆర్టీఐ వింగ్ అధ్యక్షులు రవిరెడ్డి, జిల్లాఎస్సీ సెల్ నాయకులు ఉగ్గుమూడి గురవయ్య (ఎఎంసి ఛైర్మెన్) దివ్యాంగుల అధ్యక్షులు దేవదాస్ రెడ్డి, సురుతుపల్లి మాజీ ట్రస్ట్ బోర్డ్ మెంబెర్ అజయ్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, మాజీ సర్పంచ్ గురవయ్య, సంజీవయ్య వై.ప్రసాద్ పాల్, కోటేశ్వరరావు, జయచంద్ర నాయుడు, వెంకటేశ్వర్లు ,పరందమయ్యా, తలారి వెట్టు సర్పంచ్ ప్రసాద్, కార్యకర్తలు నాయకులు, యూత్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

కబ్జా ఆరోపణలు మానండి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): తిరుపతి డివిజన్ రేణిగుంట మండల పరిధి కొత్తపాలెం గ్రామ రెవెన్యూ లెక్క దాఖలాలోని సర్వే నంబర్లు 104/ఏ, 104/5ఏ లలో గల భూమిని తాము కబ్జా చేసామని చంద్రశేఖర్, భాగ్యలక్ష్మి చేసిన ఆరోపణలు సత్య దూరమని గిరిధర్ మురారి, నాగరాజు స్పష్టం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో వారు మాట్లాడారు. ఫోర్జరీ సంతకాలతో భూమిని సొంతం చేసుకోవాలని చూస్తున్న వారిపై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రామ్మూర్తి, ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి సబ్ డివిజన్, రేణిగుంట పరిధిలోగల 33/11 కె.వి.తుకివాకం,33/11 కె.వి. కరకంబాడి ఎస్.ఎస్. 33/11 కె.వి. గురువరాజు పల్లి, ఎస్.ఎస్, 33,/11 కె.వి. ఏలమండ్యం ఎస్.ఎస్, 33/11 కె.వి. గాజులమండ్యం ఎస్.ఎస్, 33/11 కె.వి.కూర కాలువ సబ్ స్టేషన్ పరిధిలో నీ 11 కె.వి. లైన్ లు, ఎల్.టీ లైన్ లు ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ లైన్లకు ఆటంకం కలిగించే చెట్లను తొలగించుటకు, నిర్వహణకు 9వ తేది ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపిఎస్పీడిసీయాల్ ఆపరేషన్ టౌన్ డివిజన్ విద్యుత్ ఈఈ వి.చంద్ర శేఖర్ రావ్ ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళా వర్సిటీలో అధ్వానంగా పారిశుద్ధ్యం



అపరిశుభ్రంగా యూనివర్శిటీ పరిసరాలు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో పారిశుధ్యం పడకేసింది. వర్సిటీలోని విద్యార్థినీలు నివసించే వసతి గృహాల సముదాయా లలో ప్రధాన గేటు నుంచి ఆరోగ్య కేంద్రం వరకు మురుగునీరు కాలువ చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోయాయి. టిటిడి గోశాల నుంచి వచ్చే ఈ కాలువకు మురుగునీరు కూడా తోడు అవడంతో విద్యార్థులు వాసన భరించలేక పోతున్నారు. దోమలు విపరీతంగా అభివృద్ధి చెందాయి. వర్సిటీ అధికారులు స్పందించి వెంటనే విద్యార్థినిల వసతి గృహాలకు పరిసరాల చుట్టూ పరిశుభ్రం చేసి మురుగునీటి కాలవలో పిచ్చి మొక్కలు తొలగించి పరిశుభ్రం చేయాలని కోరుతున్నారు.

రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ, పీజీ సెమిస్టర్ పరీక్షలు ఫలితాలను విడుదల చేసిన వెంటనే రివాల్యుయేషన్‌కి దరఖాస్తు చేసిన విద్యార్థులకు ఫలితాలు రెడు వారాల్లోగా విడుదల్ల చేయాలని గిరిజన నవ సమాజ వ్యవస్థాపక అధ్యక్షులు పాలిత్య శివ శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడుకు వినతి ఇచ్చారు.

హత్యకేసులో ముద్దాయి జగదీష్ అరెస్ట్

ప్రజాశక్తి-సత్యవేడు: తిరుపతి జిల్లా సత్యవేడు మండలం ఓబుల్ రాజు కండ్రిగలో ఆటో డ్రైవర్ లక్ష్మయ్య మృతికి సంబంధించి నమోదైన హత్య కేసులో నిందితుడు జగదీషను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లుగా పుత్తూరు డిఎస్పి రవికుమార్ తెలిపారు. ఆటో బాడుగ నేపథ్యంలో తలెత్తిన వివాదం చివరకు లక్ష్మయ్యపై దాడికి ఆపై ఆయన మృతికి కారణమైంది. ముద్దాయి జగదీష్‌ను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్టు ఈ సందర్భంగా పుత్తూరు డిఎస్పి రవికుమార్ చెప్పారు. త్వరలోనే మరో నిందితుడ్ని కూడా అదుపులోకి తీసుకుంటామన్నారు.

తల్లిదండ్రులు మందలించారని కొడుకు ఆత్మహత్య



సుభాష్ మృత దేహం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ : ద్విచక్ర వాహనం నడిపే విషయంలో తల్లిదండ్రులు మందలించడంతో కుమారుడు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన శనివారం తిరుపతిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్న శైలజ తిరుపతి కుమ్మరి తోపులో నివాసం ఉంటున్నారు. ఈమెకు ఒక కొడుకు ఒక కూతురు. కుమారుడు సుభాష్(19) స్థానికంగా ఓ ప్రైవేటు కళాశాల బీకాం ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై డిగ్రీ చదువుతున్న తన చెల్లెలు తీసుకెళ్తూ ప్రమాదవశాత్తు పడి పోవడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సుభాష్‌ను మందలించారు. దీంతో మన స్థాపన గురైన సుభాష్ శనివారం మధ్యాహ్నం, తుమ్మలగుంట ఓవర్ బ్రిడ్జి కింద ఉన్న రైలు పట్టాలు వద్దకు వచ్చి, ఆత్మహత్య చేసుకుంటున్నట్టు వీడియో కాల్ ద్వారా కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. వారు ఎస్వీయు క్యాంపస్ పోలీసులను సంప్రదించి లొకేషన్ షేర్ చేశారు. అప్రమత్తమైన పోలీసులు అటుగా వెళుతున్న రైలును కొద్దిసేపు ఆపేశారు. కానీ అప్పటికే రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు పోస్ట్ మార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదు

ప్రజాశక్తి -ఏర్పేడు : పాపానాయుడుపేట, మఠంమంద డాలర్ కాలనీలలో బహిరంగంగా మద్యం సేవించు ప్రాంతాలను గుర్తించి రేణిగుంట డి.ఎస్.పి శ్రీనివాసరావు, ఏర్పేడు ఇన్స్పెక్టర్ జయచంద్ర, ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, పంచాయతీ సిబ్బందితో కలిసి సదరు ప్రాంతాలను శనివారం శుభ్రం చేసి, ఇకపై ఎవరైనా బహిరంగంగా మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

వైసీపీ మండల కన్వీనర్‌గా అన్నా లోకనాథ్



ప్రజాశక్తి - పుత్తూరు, టౌన్ : రూరల్ మండల వైసీపీ కన్వీనర్‌గా అన్నా లోకనాథ్‌ను పార్టీ నాయకుల ఆదేశాలమేరకు నియమించారు. శనివారం ఆయన కార్యకర్తలతో మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామని, కార్యకర్తలకు అందుబాటులో ఉటానని, పార్టీ పూర్వ వైభవానికి కృషి చేస్తానని తెలిపారు.

అపరిశుభ్రంగా బస్సు షెల్టర్



ప్రజాశక్తి -కోట : కోట మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మెయిన్ రోడ్డు ప్రక్కనే ఉన్న బస్ షెల్టర్ నిరుపయోగంగా ఉంది. బిక్షగాళ్లకు నెలవుగా మారింది. చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా తయారైంది. మందు బాబులు అక్కడ చేరి, ప్రయాణీకులు అటువైపు కూడా పోలేని పరిస్థితి నెలకొంది. బస్సు షెల్టర్ అపరిశుభ్రంగా ఉండడంతో ప్రయాణికులు బస్సుల కోసం ఎదురు చూసేందుకు వాడుకోలేకున్నారు. పలు శాఖల అధికారులు, సిబ్బంది వారి కార్యాలయాలకు ఇటువైపే వెళుతూ, వస్తూ ఉంటారు. బస్సు షెల్టర్‌కు ఎదురుగా రోడ్డు ప్రక్కనే ఎండకు, వానకు బస్సులు కోసం ఎదురు చూస్తుంటారు. కానీ అధికారులు అటువైపు కన్నెత్తికూడా చూడడం లేదని స్థానికులు పెదవి విరుస్తున్నారు. బస్సు షెల్టర్‌ను శుభ్రం చేసి ప్రయాణికులుకు అందుబాటులోకి తేవాలని ప్రయాణీకులు, గ్రామస్తులు కోరుతున్నారు.

> **బస్ షెల్టర్‌ను శుభ్రం చేస్తే ప్రయాణికులు ఉపయోగించుకుంటారు**
>
> అపరిశుభ్రంగా ఉన్న బస్సు షెల్టర్‌ను పంచాయతీ సిబ్బంది శుభ్రం చేస్తే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. వచ్చే ఎండాకాలానికి ప్రయాణీకుల సౌకర్యార్థం అధికారులు స్పందించి బస్సు షెల్టర్ శుభ్రం చేయిస్తే బాగుంటుది.
>
> **- దారా సురేష్, ఎంపిటిసి, కోట**

మంచి పుస్తకం ఒక మంచి స్నేహితుడి వంటిది

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : మంచి పుస్తకం ఒక మంచి స్నేహితుడి వంటిదని, పుస్తక పఠనం ఒక మంచి అలవాటు అని ప్రతి ఒక్కరూ రోజూ కొంత సమయం మంచి పుస్తక పఠనానికి కేటాయించాలని యువతకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. శనివారం స్థానిక ఇస్కాన్ టెంపుల్ ఎదురుగా ఉన్న ప్రాంగణంలో వారం రోజులకు పైగా కొనసాగుతున్న 17వ తిరుపతి పుస్తక ప్రదర్శనను కలెక్టర్ దంపతులు చిన్నారితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమూల్యమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నాని, తిరుపతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలతెలాపారు.

అసత్య ఆరోపణలు హేయం



సమావేశంలో అంబేద్కర్ భవన్ ఛైర్మన్ డాక్టర్ పరమశివన్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : దళితులకు ఆశ్రయంగా నిలుస్తున్న శ్రీ చెల్లప్ప మేస్త్రి మెమోరియల్ అంబేద్కర్ భవన్‌పై అసత్యపు ఆరోపణలు తగవని తిరుపతి అంబేద్కర్ భవన్ చైర్మన్ పరమశివన్ హెచ్చరించారు. స్థానిక బాలాజీ కాలనీలోని అంబేద్కర్ భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీ ఎస్సీ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగిశెట్టి ధర్మయ్య తిరుపతి అంబేద్కర్ భవన్‌పై విమర్శలు చేయడం తగదన్నారు. ఆరోపణలు మానుకొని భవన్ అభివృద్ధికి సహకరించాలని లేనిపక్షంలో ప్రజలే వారికి బుద్ధి చెప్తారని అన్నారు. ఈ సమావేశంలో అంబేద్కర్ భవన్ కార్యదర్శి కె.నాగేశ్వరరావు, సభ్యులు ఇంద్రముని, గోపి, పుష్పరాజ్ పాల్గొన్నారు.

పుస్తక పఠనం ఓ మంచి అలవాటు: కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: మంచి పుస్తకం ఒక మంచి స్నేహితుడి వంటిదని, పుస్తక పఠనం ఒక మంచి అలవాటు అని ప్రతి ఒక్కరూ రోజూ కొంత సమయం మంచి పుస్తక పఠనానికి కేటాయించి వారి దైనందిన జీవితంలో అలవర్చుకోవాలని యువతకు తిరుపతి కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. స్థానిక ఇస్కాన్ టెంపుల్ ఎదురుగా ఉన్న ప్రాంగణంలో వారం రోజులకు పైగా కొనసాగుతున్న 17వ తిరుపతి పుస్తక ప్రదర్శనను కలెక్టర్ దంపతులు చిన్నారితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతీయ విద్యా భవన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 17వ తిరుపతి పుస్తక ప్రదర్శన ప్రజల మన్ననలు పొందుతూ వారం రోజులుగా కొనసాగుతోందని, ఎన్నో అమూల్యమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, తిరుపతి ప్రజలు ప్రతి ఒక్కరూ సందర్శించాలని సూచించారు. మంచి పుస్తకం ఒక మంచి స్నేహితుడి వంటిదని, మంచి పుస్తక పఠనం మంచి అలవాటుగా మన దైనందిన జీవితంలో భాగంగా అలవర్చుకుంటే జ్ఞానం పెంపొందు తుందన్నారు. కలెక్టర్ దంపతులు చిన్నారితో కలిసి పుస్తక ప్రదర్శనను తిలకించి పలు పుస్తకాలను కొనుగోలు చేశారు. ఈ పుస్తక ప్రదర్శనలో వివిధ రాష్ట్రాల నుండి 70 దుకాణాలు ఏర్పాటు చేశారన్నారు. ఈ ఆదివారం పుస్తక ప్రదర్శన ముగియనుందని ప్రతిరోజూ సాయంత్రం సంగీత, సాహిత్య కార్యక్రమాలు ఏర్పాటు చేశామని భారతీయ విద్యా భవన్ డైరెక్టర్, పుస్తక ప్రదర్శన నిర్వాహకులు డాక్టర్ సత్యనారాయణ రాజు, అసోసియేట్ సెక్రటరీ దక్షిణామూర్తి కమిటీ సభ్యులు యుగంధర్ రాజు కలెక్టర్‌కు వివరించారు. పలువురు సాహిత్య పుస్తక అభిమానులు కలెక్టర్‌తో మాట్లాడుతూ ఈ పుస్తక ప్రదర్శన చాలా ఉపయోగకరంగా వుందని పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో చేపట్టిన పలు సాహిత్య, సంగీత కార్యక్రమాలు సందర్శకులను ఎంతగానో అలరిస్తున్నా యని వారు తెలిపారు.


కలెక్టర్‌కు పుస్తకాలను బహూకరిస్తున్న పుస్తక కేంద్రాల విక్రయ దారులు


రచయిత జయపాల్‌ను సన్మానిస్తున్న రచయితల సంఘం

జయపాల్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో శనివారం జిల్లా రచయితల మహాసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నుంచి హాజరైన కవి, రచయిత, సీనియర్ జర్నలిస్ట్ అరవ జయపాల్‌కు ఘన సన్మానం చేశారు. ఇదే కార్యక్రమంలో అదే సమయంలో 17 మంది రచయితలు రచించిన పుస్తకాలను సైతం ఆవిష్కరించారు. వైఎస్సార్ రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూలా మల్లికార్జున రెడ్డి, అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిలుగా బుద్ధ ప్రసాద్, జింక సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు .

సబ్సిడీ రుణాలలో శాలివాహనులకు ప్రాధాన్యత ఇవ్వండి..

ప్రజాశక్తి -తిరుపతి(మంగళం): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న శాలి వాహన కులస్తులకు బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే రుణాలలో ప్రాధాన్యత ఇవ్వాలని తిరుపతి పార్లమెంటు బీసీ శాలివాహన సాధికార కమిటీ అధ్యక్షులు ఆముదాల తులసీదాస్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి సబితను కలిసి వినతి ఇచ్చే విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తిరుపతి పర్యటనకు వచ్చిన మంత్రిని పద్మావతి అత్యధిక గృహంలో బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి సమక్షంలో వినతి ఇచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి సానుకూల నిర్ణయం తీసు కుంటామని హామీ ఇచ్చారన్నారు.


మంత్రిని కలిసిన బీసీ శాలివాహన సాధికార కమిటీ అధ్యక్షులు ఆముదాల తులసీదాస్

భక్తులకు వసతి ఏర్పాటు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో యమహా షోరూం అధినేత యమహా సుబ్రహ్మణ్యం తిరుమల దర్శనానికి 60 మంది భక్తులు పాదయాత్రగా వెళుతుండగా శుక్రవారం రాత్రి వారికి అన్న ప్రసాదాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సేవా సంస్థ జాయింట్ సెక్రెటరీ యమహా సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు, ప్రగతి కుటుంబ సభ్యులు పోతిరెడ్డి పెంచలయ్య, నాగరాజు, ప్రసాద్ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.


భక్తులకు భోజన వసతి కల్పించిన ప్రగతి సేవా సంస్థ

మహిళా ఉద్యోగులకు ప్రత్యేక వసతులు కల్పించాలి

జాతీయ మహిళా నాయకుల వర్క్ షాప్‌లో ఏకగ్రీవ తీర్మానం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: మహిళా ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పాఠశాల, కళాశాలల్లో బాలికలకు ప్రత్యేక వసతుల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఇందుకు బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయించాలని జాతీయ మహిళా నాయకుల వర్క్ షాప్‌లో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు జాతీయ ఉపాధ్యక్షురాలు వీర మణి తెలిపారు. ఏఐఎస్‌టిఎఫ్ అనుబంధంగా ఉన్న ఎస్టీయూ ఆధ్వర్యంలో స్థానిక ఎస్టియు భవన్‌లో శనివారం మహిళా నాయకుల జాతీయ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్ లో వివిధ రాష్ట్రాల నుండి ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండి మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు. మహిళా ఉద్యోగుల, ఉపాధ్యాయినుల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఇంటర్ అనంతరం బాలికలు ఉన్నత విద్యాభ్యాసనకు వెళ్లలేక వెనుకబడి పోతున్నారని, బాలికల ఉన్నత విద్యాభ్యాసనకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. దేశంలో చాలా రాష్ట్రాల్లో పాఠశాలలు, కళాశాలల్లో బాలికలతో ప్రత్యేక వసతుల కల్పనలో చాలా వెనుకబడి ఉందన్నారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులు ఎక్కువగా ఉన్న కార్యాలయాలు, కళాశాలలు, యూనివర్సిటీలలో శిశు సంరక్షణ కేంద్రాలను, బేబీ ఫీడింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. పిల్లల వయసుతో సంబంధం లేకుండా శిశు సంరక్షణ సెలవులను సర్వీసులో ఎప్పుడైనా వినియోగించుకునేలా ఏపీ ప్రభుత్వం జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు రేణుకాదేవి, శ్రీదేవి, ద్రాక్షాయణి, జ్యోతి, రమాదేవి, రమ్య, అనిత, జయంతి, జయసుధ, సరిత, ప్రవీణ కుమారి, విశాల, పుష్పలత, ఏఐఎస్‌టిఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి నర్సింహారెడ్డి, ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి రాష్ట్ర నాయకులు గాజుల నాగేశ్వరరావు, ధనుంజయ నాయుడు, రమణారెడ్డి ,గురు ప్రసాద్ తిరుపతి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమేష్ బాబు, జగన్నాథం జిల్లా నాయకులు కటారి, మునికృష్ణ నాయుడు, రమేష్ నాయక్, దేవేంద్ర, వాసు , రామాంజ నేయులు , మధుసూదన్ రాజు, మురళీకృష్ణ, శ్రీనివాసన్‌లు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న వక్తలు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి -కోట : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గూడూరు డిఎస్పి గీతా కుమారి అన్నారు. ఈ సందర్భంగా శనివారం కోట మండలం, కోట క్రాస్ రోడ్డు సమీపంలో వైన్ షాప్ ఎదురుగా రోడ్డు ప్రక్కనే ఉన్న ప్లాస్టిక్ వస్తువులను తొలగించడం జరిగింది. ఈ సందర్భంగా డిఎస్పి గీతాకుమారి విలేఖరులతో మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులను ఎక్కడపడితే అక్కడ వేయకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాకాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ హుస్సేన్ భాష, కోట ఎస్సై పవన్ కుమార్,ఏఎస్ఐ శోభారాణి,హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి, కోటేశ్వరరావు, శ్రీహరిలు ఉన్నారు.


తాగునీటి ట్యాంకులను పరిశీలిస్తున్న జనసేన నాయకులు

తాగునీటి సమస్య లేకుండా చేయండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలో పలు ఓవర్ హెడ్ ట్యాంకులను జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర రావు శనివారం ఆ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ట్యాంకులకు మరమ్మత్తులు చేయడంతో పాటు, శిథిలావస్థలో ఉన్న వాటిలో కొత్త ట్యాంకులు నిర్మించేందుకు సంబంధిత శాఖ అధికారులకు, ఎమ్మెల్యే సునీల్ కుమార్‌కు విజ్ఞప్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పిఓసి కె.మోహన్, పట్టణ కార్యదర్శి సాయికిరణ్, సనత్, వంశీ కృష్ణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

శృతికి డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగపు పరిశోధక విద్యార్థిని ఎస్. శృతికి డాక్టరేట్ ప్రధానం చేసినట్లు ఎస్వీయూ పరీక్షల అధికారి దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శృతికి పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించాలి

ప్రజాశక్తి -కోట : చిల్లకూరు మండలం, కనుపూరు ముత్యాలమ్మ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించాలని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌కు బిజెపి తిరుపతి జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి పోసిన వెంకయ్య గౌడ్ వినతి పత్రం అందచేశారు.

రైతులు డిజిటల్ గుర్తింపు కార్డులు పొందండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: రైతు సేవా కేంద్రంలో రైతులకి రైతు డిజిటల్ గుర్తింపు కార్డు ఇవ్వడం జరుగుతుందని రైతు సేవా కేంద్ర అధికారుల తెలిపారు. ఇందుకోసం రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్, ఆధార్‌కి లింక్ అయిన ఫోన్ నెంబర్ తీసుకొని గ్రామ వ్యవసాయ సహాయకులకు అందించాలన్నారు. 28తేదీ లోగా డిజిటల్ కార్డులు పొందాలని పేర్కొన్నారు. ఈ కార్డు వలన పంటల బీమా, పీఎం కిసాన్ యోజన, పంటనష్ట పరిహారం, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యంత్ర పరికరాలపై రాయితీలు పొందేందుకు అర్హత లభిస్తుందని తెలియచేశారు.